నేలబారు చప్టాలతో అవస్థలు



కడపరాజుపల్లె వద్ద బ్రిడ్జిపై ప్రవహిస్తున్న తీగలేరు



మార్కాపురం-దోర్నాల మార్గంలో చిన్నదోర్నాల వద్ద తీగలేరు వరద ఉధృతి

- వై.చర్లోపల్లి, గంటవానిపల్లె వాసుల కష్టాలు
- తీగలేరు తగ్గేంత వరకూ అంతే సంగతులు

పెద్దదోర్నాల: దశాబ్దాల క్రితం మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులపై నిర్మించిన నేలబారు చప్టాలతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షా కాలాలలో ఆయా గ్రామాల పరిధిలో ఉన్న వాగులు, వంకలు పొంగినప్పుడల్లా గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ప్రవాహం తగ్గేంత వరకూ అక్కడ చిక్కుకు పోవాల్సిందే. ఇది మండల పరిధిలోని ఎగువ చర్లోపల్లి, గంటవానిపల్లె, చిన్నదోర్నాల తదితర గ్రామాల పరిస్థితి. జిల్లాలోని సరిహద్దు ప్రాంతమైన పెద్దదోర్నాల నల్లమల అభయారణ్యం పరిసరాల్లో ఉంది. దీంతో వర్షాకాలం సీజన్‌లో నల్లమల పరిసరాల్లో వర్షాపాతం ఎక్కువగా నమోదవుతుంది. ఈ నేపథ్యంలో నల్లమలలో ప్రవహించే దొంగలవాగు, తీగలేరు, దేవలూటి, రాళ్లవాగు తదితర వాగులు పొంగి మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి రోజుల తరబడి ప్రవహిస్తుంటాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులపై దశాబ్దాల కిందట అప్పటి అవసరాల దృష్ట్యా నేలబారు చప్టాలను నిర్మించారు. నల్లమల అభయారణ్యంలో కురిసిన భారీ వర్షాలకు రహదారిలోని చప్టాలు సైతం వరద నీటిలో మునిగిపోతుండటంతో చర్లోపల్లి, గంటవానిపల్లె, కడపరాజుపల్లె తదితర గ్రామాల ప్రజలు గ్రామాల్లోనే చిక్కుకుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో వరద నీరు తగ్గేంత వరకూ కనీస సౌకర్యాలకు నోచకోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతో పాటు మార్కాపురం, పెద్దదోర్నాల మధ్య ఉన్న చిన్నదోర్నాల వద్ద తీగలేరు పొంగితే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఆయా గ్రామాల మధ్య ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొవాల్సిందే. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా గ్రామాల్లో నిర్మించిన చప్టాల స్థానంలో నూతనంగా బ్రిడ్జిలు నిర్మించి రహదారులపై ఏర్పడే ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బూచేపల్లిపై ఉప్పొంగిన అభిమానం



బూచేపల్లిని సత్కరిస్తున్న దర్శి మండల వైఎస్సార్ సీపీ నాయకులు



దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు

- భారీగా ఒంగోలు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒంగోలులో శుక్రవారం ప్రమాణ స్వీకారం సందర్భంగా దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గ ఎమ్మెల్యేను జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై వైఎసార్ సీపీలో మరింత జోష్ పెరిగింది. సుమారు 300కుపైగా వాహనాల్లో ఎవరికి వారు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలి వెళ్లారు. వాహనాలకు పార్టీ జెండాలు కట్టుకుని తమ ఉత్సాహాన్ని కనబరిచారు. జిల్లాస్థాయిలో బూచేపల్లి అధ్యక్షుడు అంటే నియోజకవర్గానికి ఎంతో అండ అవుతుందని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీగా తరలిన అభిమానులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన్ను ఘజమాలలతో ఘనంగా సత్కరించారు. దర్శి మండలం నుంచి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీపీ గోళ్లపాటి సుధా అచ్చయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబూరావు, కర్నా భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు కొల్లా భాస్కర్, పానుగంటి కోటేశ్వరరావు, ముండ్లమూరు మండలం నుంచి ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మనందరెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మ నాగిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సూదిదేవర అంజయ్య, తాళ్లూరు మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, గోళ్లపాటి మోషే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దొనకొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒంగోలులో ప్రమాణస్వీకారానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద పార్టీ జెండా ఊపి దొనకొండ మండలంలోని 18 పంచాయతీల నుంచి 75 వాహనాల్లో సుమారు 900 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రమాణస్వీకారానికి బయల్దేరారు. జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గుంటు పోలయ్య, కర్నాటి ఆంజనేయరెడ్డి, పాతకోట కోటిరెడ్డి, నూనె వెంకటరెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య, సైరాబాను, కాలూరి రమణయ్య, ఇండ్ల శ్రీనివాసులు, ముజాయిద్, కసిబిసి నాగరాజు, తాల్లూరి నగేష్, ఆది సుబ్బారావు, భూషణం, బాపనపల్లి ఆంజనేయులు, కన్నెధార వెంకట సుబ్బయ్య, వీరపనేని చెన్నయ్య, విప్పర్ల చిన్న మల్లయ్య, ఐలూరి శ్రీనివాసరెడ్డి, ఎగ్గోని కృష్ణారెడ్డి, డి.చెంచిరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, కందుల వెంకటేశ్వరరెడ్డి, బాపనపల్లి శ్రీను, గోనా జాకోబ్, ఎలక్ట్రికల్ గఫూర్, హర్షవర్ధన్‌రెడ్డి, పాతకోట హరినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి శుక్రవారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఒంగోలు బయల్దేరి వెళ్లారు. సుమారు 40 వాహనాల్లో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మాజీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయల్దేరి వెళ్లారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి మండలంలోని నాయకులను సమీకరణ చేసి కార్యక్రమం విజయవంతానికి కృషి చేశారు.



ముండ్లమూరు నేత సుంకర బ్రహ్మనందరెడ్డి, ఇతర నాయకులు



తాళ్లూరు మండల నాయకులు..



కురిచేడు: ఒంగోలుకు బయల్దేరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



దొనకొండ నుంచి ఒంగోలు బయల్దేరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎంపీడీఓ విజయశేఖర్ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ విజయశేఖర్

కురిచేడు: ఎంపీడీఓగా విజయశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కందుకూరులో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన్ను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

పుల్లలచెరువు: మేజర్ పంచాయతీ పుల్లలచెరువు కార్యదర్శిగా ఈ.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న బాలునాయక్ జిల్లా అధికారులు విధుల నుంచి తొలగించగా అప్పటి నుంచి ఇన్‌చార్జిలుగా పలువురు కార్యదర్శులు పనిచేశారు. ఇటీవల జరిగిన కార్యదర్శుల బదిలీల్లో భాగంగా పుల్లలచెరువు కార్యదర్శిగా శ్రీనివాసరావును జిల్లా అధికారులు నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

కురిచేడు: మండలంలోని కల్లూరు గుట్టమీదపల్లెలో బెల్టుషాపు నిర్వహిస్తున్న దేవయ్య అనే వ్యక్తి వద్ద 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి శుక్రవారం రాత్రి దేవయ్య ఇంటిని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు ఆయన తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం

దొనకొండ: ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ప్రతి ఉద్యోగి బదిలీపై వెళ్లాల్సి వస్తుందని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన ఆర్‌ఐ రామ్‌తేజ్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివరామ్, వీఆర్‌ఓలు అమీర్, సౌజన్యలకు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తోటి ఉద్యోగులు వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలకు డిజిటల్ వాల్‌క్లాక్ బహూకరణ



వాల్‌క్లాక్‌ను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో 2019–22 బ్యాచ్ విద్యార్థులు కళాశాలకు డిజిటల్ వాల్ క్లాక్ బహూకరించారు. స్టీవెన్, యశ్వంత్, హేమంత్, కళ్యాణ్, ప్రతాప్ కళాశాలకు వచ్చి తమకు డిగ్రీలో విద్యాభ్యాసం నేర్పించిన ఉపాధ్యాయులతో మాట్లాడి తమ సొంత ఖర్చులతో వాల్ క్లాక్ బహూకరించారు. వారిని విద్యా సంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, అడ్మిన్ నానీ, ప్రిన్సిపాల్ రామయోగి, నాగేంద్రబాబు, అధ్యాపకులు అభినందించారు.

ఈ-క్రాప్ తప్పనిసరి



ఈ-క్రాప్ చేసిన పొలాలు తనిఖీ చేస్తున్న ఏఓ బాలకృష్ణనాయక్



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

దర్శి: రైతులు ఈ-క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని 23 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ-క్రాప్ చేసుకున్న రైతుల పంట పొలాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే రైతులకు అందాల్సిన అన్నీ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. నష్టపరిహారాలు అంచనాలు ఈ-క్రాప్‌లో వేసిన పంట ప్రకారమే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: సాగు చేసిన పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా వేయాలని మండల వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండల పరిధిలో దేవరాజుగట్టు, గొబ్బూరు గ్రామాల్లో పంట నమోదును ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకుని ఇంకా ఏవరైనా ఈకేవైసీ చేయించుకోకపోతే వెంటనే మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహాయకుల దగ్గరకు వెళ్లి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు చేయడంలో ఏమైనా తప్పులు ఉన్న రైతులు గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టుకొని వాటిని సరి చేయించుకోవాలని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులు చిన్నా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్త్రీ శక్తి భవనంలో వార్షికోత్సవం

దొనకొండ: స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఏపీఎం జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం రైతు ఉత్పత్తిదారుల 7వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం నారాయణ హాజరై మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రాధాన్యం, నిర్వహణ గురించి వివరించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెమ్మసారి రాములు, ఉపాధ్యక్షులుగా కిలారి లక్ష్మీనరసింహ, కార్యదర్శిగా ఫణిదపు వీరాంజనేయులు, ఉప కార్యదర్శిగా తాటి చెన్నకేశవులు, కోశాధికారిగా బి.నాగేశ్వరరావుతో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీలు, రైతులు పాల్గొన్నారు.



త్రిపురాంతకం: హంసవాహనంపై శ్రీబాలాత్రిపురసుందరీదేవి



త్రిపురాంతకం: ప్రత్యేక అలంకారంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్



తాళ్లూరు: రాజరాజేశ్వరీ దేవిగా దర్శనం ఇస్తున్న గుంటి గంగ అమ్మవారు

ఘనంగా దేవీ నవరాత్రి మహోత్సవాలు




దొనకొండ: వేదగాయత్రీగా ఈశ్వరాంబ



పుల్లలచెరువు: ముటుకులలో గాయత్రీదేవిగా శ్రీరేణుక ఎల్లమ్మ



పెద్దదోర్నాల: రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



దర్శి:వేదగాయత్రీదేవిగా దద్దాలమ్మ అమ్మవారు



దర్శి: బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



దర్శి: వేదగాయత్రీ దేవిగా పోలేరమ్మ తల్లి



కురిచేడు: రాజరాజేశ్వరి దేవిగా శ్రీజ్ఞానప్రసూనాంబ



రాజంపల్లిలో రాజ్యలక్ష్మి అమ్మవారి వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు



త్రిపురాంతకం: ప్రత్యేక పూజల్లో భక్తులు, ఉభయదాతలు

పుల్లలచెరువు: శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం రెండో రోజు ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ముటుకులలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి, పుల్లలచెరువులో బ్రహ్మం గారి ఆలయంలో గోవిందమ్మలను గాయత్రీదేవిగా అందంగా అలంకరణ చేశారు. గాయత్రీదేవి అవతారంలో భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ వారు రాత్రి వేళ పలు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరణ చేశారు.

గజలక్ష్మీదేవి అలంకారంలో..

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొౢడాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రాజ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. ఈ సందర్భంగా ఉభయదాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దదోర్నాల: దసరా నవరాత్రులు పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆశ్వీయుజ శుద్ధ విదియ నాడు పలు దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జగజ్జనని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీ మాత శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేకువ జాము నుంచే అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు బి.రాం ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, చండీపారాయణం చేశారు. మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఈశ్వరాంబ అమ్మవారు వేద గాయత్రీగా దర్శనమిచ్చారు. మణిశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, అమ్మవారి అష్టోత్తర శతనామావలి, కుంకుమ పూజలు, మహా మంత్రాన్ని పఠించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. వచ్చిన భక్తులకు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవీలు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయ పూజార్లు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, పారాయణం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

త్రిపురాంతకం: దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు శుక్రవారం విదియ రెండో రోజు బ్రహ్మచారిణి అలంకారంలో హంసవాహనంపై ఆలయ ఉత్సవం వైభవంగా జరిగింది. త్రిపురాంతకం ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా రెండోరోజు జరిగాయి. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారి వాహన సేవలో పాల్గొన్నారు. జై బాల నినాదాలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. శనివారం చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్రవాహనంపై శ్రీబాలా త్రిపురసుందరీదేవి వాహన సేవ జరగనుంది.

దర్శి: నియోజకవర్గంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా రెండో రోజు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవారిని రూ.41 లక్షల నగదుతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం అందరికీ అన్నదానం చేశారు. పట్టణంలోని దద్దాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ తల్లి వేద గాయత్రీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. తాళ్లూరు మండలంలో ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ గుంటి గంగా భవాని అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవీగా దర్శనం ఇచ్చారు. మ్మవారినిఅందంగాపూలమాలలతో అలంకరించారు.

త్రిపురాంతకం: శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. త్రిపురాంతకం అమ్మవారి ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిక్కిరిసింది. దసరా శరన్నవరాత్రులు సందర్భంగా పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు, ఉభయదాతలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్ భక్తులకు ప్రత్యేక అలంకారంతో దర్శనమిచ్చింది. దసరా ప్రత్యేక పూజలు వేదపండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఆలయాల వద్ద శ్రీకార్యసిద్ధి గణపతి మందిరం, ఆనంద నిలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నారు. వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందిస్తున్నారు.